# స్వరసామ్రాట్

ఆ చిన్న రాజ్యం ఆయనది.

ఆయన దానికి రాజు సర్వసామ్రాట్!

ఆ రాజ్యం ఎప్పుడూ మనుషులతో కిటకిటలాడి పోతూంటింది.

అందరూ కూడా ఈ ఊర్నించి ఆ ఊరూ ఆ ఊర్నుంచి ఈ ఊరు వెళ్తూ ఆయన రాజ్యంలో ఓ మజిలి వేస్తారు.

అందర్నీ ఆ రాజు అమ్మా! అయ్యా! పాపా! బాబూ అని సంబోధించి మాట్లాడుతాడు.

ఎక్కడికెళ్తున్నారో కనుక్కుంటాడు.

ఏ ఊర్నించి వస్తున్నారని మర్యాదగా పలకరిస్తాడు.

ఎండలో వచ్చేవాళ్ళకి చల్లటి ఛాయని చూపిస్తాడు.

ముసలివాళ్ళని, ఆడవాళ్ళని గౌరవిస్తాడు. ఓ చోట కూచోపెడ్తాడు. తన రాజ్యంలో వాళ్ళ క్షేమం, సుఖసంతోషాలే తన బాధ్యత, తన విధి అందుకే అమాయకంగా ఉన్న పిల్లలతో సరదాగా మాట్లాడలనిపించినా, తుళ్ళుతూ, పెలుతూ రాజ్యంలోకి అడుగు పెట్టిన కుర్రకారుని వాళ్ళ అల్లరిని వినాలనిపించినా, కోరగా, గీరగా అమ్మాయిలు, నిదానంగా, శాంతంగా, చూసే ఆడవాళ్ళు.

మరోసారి చూడాలనిపించేంత అందమైన సుందరాంగులు ముందుగా నడిచి వెళ్ళిపోతున్నా కూడా, తన పనినీ ఏనాడు ఆపడు.

తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూనే ఉంటాడు.

తన విధిని ఏనాడు మర్చిపోడు.

ఆ రాజు ఎంత మంచివాడో అంత కఠినుడు కూడా.

తన రాజ్యంలో వాళ్ళంతా ఒక్క త్రాటిమీద నడవాలని, ఆయన కొన్ని

రూల్స్ రెగ్యులేషన్స్ పెట్టాడు. ఆయన వాటిని ఏనాడు అతిక్రమించడు. ఆయన రాజ్యంలో వాళ్ళు కూడా అధిగమించకూడదు. ప్రతిఘటించకూడదు.

అలాచేసిన వాళ్ళకి కఠినమైన శిక్ష విధిస్తాడు. ఆ విషయాల్లో ఆయన గొప్ప నియంత ద గ్రేట్ డిక్టేటర్ హిట్లర్, మునోలిలని మించినవాడు.

ఆయన రాజ్యంలోకి అడుగుపెట్టిన వాళ్ళంతా పన్ను కట్టాల్సిందే. ముష్టివాడైనా సరే, ముఠా నాయకుడైనా సరే, ముండల్నుంచుకున్న వాడైనా సరే ఖూనీకోరైనా, కూలివాడైనా రాజీవ లోచనులైనా రాజకీయ నాయకుడైనా

ఎవరైనా ఆయనకి పట్టింపులేదు. ఆయన దృష్టిలో అందరూ ఒకటే, పాదం పెట్టినందుకు పన్ను కట్టాల్సిందే. వాళ్ళ దగ్గర పన్ను తీసుకోడం తన విధి, తన కర్తవ్యం తన బాధ్యత అని ఆ రాజు అనుకుంటాడు. అందుకే ఆ విధి నిర్వహణలో కాళ్ళు నొప్పులని ఓ చోట కూచోడు. కళ్ళు తిరుగుతున్నాయని ఓ మూల పడుకోడు. నిర్విరామంగా పన్నులన్ని అందరి దగ్గరా వసూలు చేస్తాడు. డ్యూటీ అయ్యేకా ఆ పన్నుని కోశాగారంలో జమకట్టేస్తాడు.

రాజు వేషం మార్చేస్తాడు.

అంతటి మహారాజూ, అంతటి గొప్ప నియంత, మామూలుగా అయిపోతాడు.

గృహ సామ్రాజ్యంలోకి అడుగుపెట్టగానే ఆ సామ్రాజ్యాన్ని చిటికన వేలుపై నడిపే ఆమె పాదాల దాసుడైపోతాడు. ఇంతకీ రాజుగారెవరయ్యా అంటే మన ఆర్టీసి బస్సు కండక్టరు గారండి.

(ఆంధ్రభూమి వారపత్రిక 04-08-1988)